'బీసీ' హాస్టల్ నిర్మాణానికి నిధుల గ్రహణం
- రూ. 2.90 కోట్లతో జీ+1 భవనం
- ఏడాదిలో పూర్తి చేయాలని ఒప్పందం
- రెండేళ్లు దాటినా అసంపూర్తిగానే..
- అద్దె భవనంలో కొనసాగుతున్న వసతిగృహం
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు

8



సంగారెడ్డిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం

'ఒకటి'న ఎంసీహెచ్‌లో

12 మంది జననం

సంగారెడ్డి అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమైన రోజుల్లో పిల్లలు జన్మిస్తే ప్రత్యేక గుర్తింపు ఉంటుందని భావిస్తారు. కొత్త సంవత్సరం ప్రవేశించే వేళ 2025 జనవరి 1న సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో 12 మంది జన్మించారు. 2023 డిసెంబరు 31 అర్ధరాత్రి 12 గంటల తర్వాత పుట్టిన పిల్లల్లో ఐదుగురు మగ శిశువులు, ఏడుగురు ఆడ శిశువులు జన్మించడం విశేషం. కొత్త సంవత్సరంలో పిల్లలు జన్మించడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. జీవితంలో గుర్తుండి పోయే రోజుగా నిలుస్తుందని రెట్టింపు ఆనందం వ్యక్తం చేయగా, పలువురు సంబురాలు చేసుకున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో సుమారు 60 మంది శివువులు జన్మించారని వైద్యాధికారులు పేర్కొన్నారు.

మళ్లీ చలి పంజా..

కోహీర్‌లో 8.4 డిగ్రీల ఉష్ణోగ్రత

- రాష్ట్రంలోనే రెండో అత్యల్పం
- సంక్రాంతి వరకు కొనసాగనున్న తీవ్రత
- వణుకుతున్న ఉమ్మడి మెదక్ జిల్లా



కోహీర్‌లో చలి కాచుకుంటున్న యువకులు

కోహీర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలో చలి తీవ్రత మళ్లీ పెరిగింది. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో గురువారం 8.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇది రాష్ట్రంలోనే రెండో అత్యల్ప ఉష్ణోగ్రత. ఉమ్మడి జిల్లాలో గత సంవత్సరం డిసెంబర్ 18 నుంచి చలి తీవ్రత తగ్గినప్పటికీ నూతన సంవత్సర ప్రవేశంతోనే చలి తీవ్రత మళ్లీ పెరిగింది. జనవరి ఒకటో తేదీ ఉదయం నుంచే చలి తీవ్రత పెరిగింది. అత్యల్ప ఉష్ణోగ్రతలకు ఈదురుగాలులు కూడా తోడవడంతో చలి తీవ్రత పెరిగింది. దీంతో ప్రజలు ఉదయం 10 గంటల వరకు చలికి భయపడి ఇంట్లో నుంచి బయటికి రాలేని పరిస్థితి ఏర్పడింది. తప్పని పరిస్థితుల్లో పాల వ్యాపారస్తులు, వ్యవసాయదారులు, పరిశ్రమలకు వెళ్లే కార్మికులు స్వెటర్లు, మంకీ క్యాప్‌లు ధరించి తమ పనులకు వెళ్లారు. జనవరి 15వ తేదీ వరకు చలి తీవ్రత కొనసాగుతుందని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాలోనే కాదు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చలి తీవ్రత పెరిగింది. ఉమ్మడి జిల్లాలో బుధవారం రాత్రి నమోదైన ఉష్ణోగ్రతలు ఇలా ఉన్నాయి...

ఉష్ణోగ్రత వివరాలు

కోహీర్‌లో 8.4, అల్గోల్ 9.1, మల్‌చేల్మ 9.3, న్యాల్‌కల్ 10.5, మొగుడంపల్లి 10.2, సత్వార్ 10.2 , నల్లవల్లి 10.2, ఝరాసంగం 10.5, , జహీరాబాద్ 10.5, అల్మాయిపేట 11.1, దిగ్వాల్ 11.1. లక్ష్మీ సాగర్ 11.6, ముక్తాపూర్ 11.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మెదక్ జిల్లాలోని బోడగాట్‌లో 11.9, దామరంచ 11.7, కొత్తపేట్ 11.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సిద్దిపేట జిల్లా మునిగడపలో 11.7, కొండపాక 12.2, రాయపోలు మండలంలోని బేగంపేట్‌లో 12.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



రేపు, ఎల్లుండి ఆంధ్రజ్యోతి-ఏబీఎన్

ముత్యాల ముగ్గుల పోటీలు

మెదక్ కల్చరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్... ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్ వేర్) ఈ నెల 4వ తేదీ శనివారం మెదక్ జిల్లా కేంద్రంలోని సిద్ధార్థ మోడల్ హైస్కూల్, వెంకట్రావునగర్‌లో నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరిగే పోటీల కోసం 9963666434, 9912102888 నంబర్లకు కాల్ చేసి పేరు నమోదు చేసుకోవాలని 'ఆంధ్రజ్యోతి' సిబ్బంది తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచినవారికి బహుమతులు బహుమతులు అందజేస్తారు. పోటీలో పాల్గొనే ప్రతీ ఒక్కరికి రిటర్న్ గిఫ్ట్ ఉంటుంది.

5న సంగారెడ్డిలో...

సంగారెడ్డి అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్... ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్ వేర్) సంగారెడ్డిలోని శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో ఆంధ్రజ్యోతి-వాసవి మాఇల్లు సంయుక్తంగా ఈ నెల 5వ తేదీ ఆదివారం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు జరగనున్న ముగ్గుల పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.6 వేలు, రెండో బహుమతిగా రూ.4 వేలు, మూడో బహుమతిగా రూ.3 వేలు ప్రోత్సాహక నగదు బహుమతి ఇవ్వనున్నారు. పోటీల్లో పాల్గొనే మహిళలు ఉదయం 9.30 గంటల వరకే చేరుకోవాలి. ఆసక్తి కలిగిన మహిళలు 9603208270, 9441648050 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని 'ఆంధ్రజ్యోతి' సిబ్బంది తెలిపారు.



సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో స్పెషల్ క్లాసులో విద్యార్థులు

పదో తరగతి స్పెషల్ క్లాసులు షురూ

విద్యార్థులకు స్నాక్స్ అందజేసేందుకు నిధులు మంజూరు

సంగారెడ్డి అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో పదో తరగతి స్పెషల్ క్లాసులు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. వార్షిక పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ముందస్తు స్పెషల్ క్లాసుల నిర్వహణకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. మార్చి 15 వరకు రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. ఉదయం 8.15 గంటల నుంచి 9.15 వరకు, సాయంత్రం 4.15 గంటల నుంచి 5.15 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. పదో తరగతి ఫలితాల్లో జిల్లా ప్రథమ స్థానంలో నిలపాలనే ఉద్దేశ్యంతో 52 రోజుల ప్రణాళిక సిద్ధం చేసిన విషయం తెలిసిందే. ఈమేరకు ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. స్పెషల్ క్లాసుల నిర్వహణలో భాగంగా విద్యార్థులు ఆకలి నుంచి ఉపశమనం పొందేందుకు అల్పాహారాన్ని అందజేయాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ఇందు కోసం జిల్లా కలెక్టర్ రూ.52 లక్షల ప్రత్యేక నిధులు కేటాయించినట్టు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఒక్కో విద్యార్థికి రూ.10 చొప్పున వెచ్చించనున్నారు. కాగా విద్యార్థులకు రోజూ వారిగా అందించే అల్పాహారం మోనూను విద్యాశాఖ రూపొందించింది.

ఫాంల్యాండ్ దందా

- బీడు భూములను విక్రయించి రూ. కోట్లు సంపాదిస్తున్న వ్యాపారులు
- నారాయణఖేడ్ ప్రాంతంలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న వెంచర్లు

6



ఫాంల్యాండ్ పేరిట విక్రయిస్తున్న భూమి

అడుగు పెట్టిందేలే..!

- అందోలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి తాళం
- కన్నెత్తి చూడని మంత్రి దామోదర్
- సంవత్సర కాలంగా నిరుపయోగం

7

గుట్టుగా గంజాయి రవాణా!

- మనోహరాబాద్ -రామాయంపేట హైవే మీదుగా తరలింపు
- పోలీసులకు చిక్కకుండా పక్కా స్కెచ్
- ఒరిస్సా-ముంబయి వరకు మాఫియా లింకులు
- నిఘా పెంచడంతో ఆరు నెలల్లో 10 కేసులు
- రూ. 2 కోట్ల విలువైన గంజాయి స్వాధీనం



రామాయంపేట బైపాస్‌లో ప్రమాదానికిగురైన కారులో లభ్యమైన గంజాయి ప్యాకెట్లు (ఫైల్)

రామాయంపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్-రామయంపేట హైవే మీదుగా గంజాయి రవాణా గుట్టుగా సాగుతోందని ఆరోపణలున్నాయి. ఈ మాఫియా పోలీసులకు చిక్కకుండా పక్కా స్కెచ్ వేసి వాహనాల్లో తరలిస్తున్నారని సమాచారం. ఒడిశా నుంచి హైదరాబాద్ చేరుకున్న గంజాయిని ప్యాకెట్లు, చిన్న చిన్న సంచులుగా మార్చి జాతీయ రహదారి నుంచి అనుమానం రాకుండా కార్లలో రవాణా చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఇటీవల ప్రభుత్వం గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపడంతో పోలీసుల నిఘా అధికమైంది. దీంతో, కేవలం 45 కిలోమీటర్ల హైవే పరిధిలోనే మునుపెన్నడు లేనివిధంగా ఆరు నెలల్లోనే 10 కేసులు నమోదయ్యాయి. దీనిలో సుమారు రూ. 2కోట్ల విలువైన 1.20 క్వింటాళ్ల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల్లో 17 మంది నిందితులు పట్టుబడగా వీరంతా ఒరిస్సా, బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వారే. రెండున్నర నెలల క్రితం రామాయంపేట బైపాస్‌లో గంజాయితో వెళ్తున్న కారు ప్రమాదానికి గురవడంతో 88 కేజీల ఎండు గంజాయి సంచులు బయటపడ్డాయి. ఈ ప్రమాదంలో గాయపడిన స్మగ్లర్లు పరారవగా.. ఇక్కడి పోలీసులు బీహార్ రాష్ట్రానికి వెళ్లి ముఠాలోని ఓ వ్యక్తిని అరెస్టు చేయగలిగారు. రెండు నెలల క్రితం జీడిపల్లి వద్ద ఓ ఇంట్లో రహస్యంగా విక్రయిస్తున్న 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను పట్టుకొన్నారు. నార్సింగి హైవేపై 46 గ్రాములు, మిర్జాపల్లి ఎక్స్‌రోడ్‌లో 512 గ్రాములు, చేగుంట వడియారం పాత హైవేపై లారీలో తీసుకెళ్తున్న 800 గ్రాముల గంజాయిని పట్టుకుని ఒక్కొక్కరిని అరెస్టు చేశారు. మరో ఘటనలో

మిగతా వార్త 8వ పేజీలో..

ప్రభుత్వ కెపాసిటీ బిల్డింగ్ కమిషన్‌తో కేఎస్‌పీపీ అవగాహన ఒప్పందం

- 2.5 కోట్ల మంది పౌర సేవకుల సామర్థ్యాన్ని బలోపేతం చేయడమే లక్ష్యం

7



ఒప్పంద పత్రాలను చూపుతున్న కేఎస్‌పీపీ, సీబీసీ ప్రతినిధులు

అతివేగం.. చెట్టును ఢీకొన్నట్రాలీ ఆటో

- 15 మందికి గాయాలు
- పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపేందుకు వెళ్తుండగా ఘటన

6



చెట్టుకు ఢీకొని పల్టీ కొట్టిన ఆటో

సిద్ధివినాయక ఆలయంలో మాజీ ఎంపీ బీబీపాటిల్ పూజలు



మాజీ ఎంపీ బీబీపాటిల్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు

న్యాల్‌కల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రేజింతల్ గ్రామంలో స్వయంభువు వెలిసిన సిద్ధివినాయకుడి ఉత్సవాలు ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి. గురువారం మాజీ ఎంపీ బీబీపాటిల్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు, ట్రస్టు సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలో పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ట్రస్టు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఫాంల్యాండ్ దందా

- ఎకరాల్లో కొని గుంటల్లో విక్రయం
- బీడు భూములకు కాసులు కురిపించుకుంటున్న వ్యాపారులు
- నారాయణఖేడ్ ప్రాంతంలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న సంస్థలు
- ఆదివారం వచ్చిందంటే ఖేడ్‌లో వాలుతున్న నగరవాసులు



కొనుగోలుదారులకు ఆకట్టుకునేవిధంగా ప్రధాన దారుల నుంచి వేసిన రోడ్లు

నారాయణఖేడ్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పరిసర తదితర ప్రాంతాల్లో నివసించే మధ్య తరగతి, ఎగువ మధ్యతరగతి వారు తమకు కూడా కొంత భూమి ఉంటే బాగుంటుందనే ఆశను రియల్ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు ఫాంలాండ్స్ పేరిట బీడు భూములను అంటగడుతూ కాసులు పోగేసుకుంటున్నారు. నారాయణఖేడ్ ప్రాంతంలో బీడు భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసి గుంటల్లో ప్లాట్లను చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

ఆకర్షణీయమైన ప్రకటనలు

కర్ణాటక, మహారాష్ట్రల సరిహద్దుల్లో ఉన్న.. సంగారెడ్డి జిల్లాలోనే మారుమూల ప్రాంతమైన నారాయణఖేడ్ నియోజకవర్గంలో సాగుకు అనువుగా లేని బీడు, గట్టు భూములు రియల్ వ్యాపారానికి అడ్డాగా మారింది. ఖేడ్‌లో తక్కువ ధరలకు కొనుగోలు చేసి ఆకర్షణీయమైన ప్రకటనలతో మధ్యతరగతి ప్రజలను ఆకట్టుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధానంగా హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో ఉండే వారికి ప్రతి గుంటలో మల్బార్ మొక్కలు, ఎర్ర చందనం, టేకు, శ్రీగంధం, పండ్ల తోటలను పెంచుతున్నట్లు ప్రచారం చేస్తున్నారు. భూమిని కొనుగోలు చేసిన అనంతరం ఐదు నుంచి పది సంవత్సరాల్లో పెట్టిన పెట్టుబడికి మూడు నుంచి ఆరు రెట్లు అధికంగా లాభాలు చేకూరుస్తామని నమ్మబలుకుతున్నారు. భూమిని కొనుగోలు చేసిన వారు అవసరాలకు అమ్ముకోవాలనుకుంటే ప్రత్యామ్నాయ విధానాలతో లాభం చేకూరుస్తామని కూడా తెలుపుతున్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని నాగల్‌గిద్ద, కంగ్టి, నారాయణఖేడ్ మండలాల్లో ఈ వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. ప్రధానంగా హైదరాబాద్, తదితర ప్రాంతాల్లో ఉండే ప్రజలను ఆకట్టుకోవడానికి నిమ్జ్‌కు ఈప్రాంతం సమీపంలో ఉందని, కర్ణాటకలోని బీదర్ ఏయిర్‌పోర్టుకు ఈ భూములు దగ్గరగా ఉంటాయని, జాతీయ రహదారికి సమీపంలో అన్ని వసతులతో కూడిన జహీరాబాద్, నారాయణఖేడ్ పట్టణాలు ఉన్నాయని ప్రచారం చేస్తున్నారు.

ఐదారు గుంటలకు ఓ ఫాంల్యాండ్ చొప్పున విక్రయిస్తున్నారు. వీరు భూములు కొనుగోలు చేసే వారి నుంచి అడ్వాన్స్‌గా రూ.50 వేలు తీసుకుని 30 రోజుల తర్వాత పూర్తి సొమ్ము చెల్లించాలనే నిబంధన విధిస్తున్నారు. అందులో కార్నర్ ప్రాంతంలో ఉండే వాటికి అదనంగా చార్జీలు, నార్త్, ఈస్ట్ దిక్కుల్లో ఉన్న వాటికి మరింత అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎకరాల్లో కొనే పరిస్థితి లేకపోవడంతో, మధ్యతరగతి వారు తమ పిల్లల భవిష్యత్తు కోసం ఉపయోగపడుతుందని, ఈ ఫాంలాండ్స్‌లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. కార్పొరేట్ వ్యాపారులు వీరికి పట్టా పాసు పుస్తకంతో పాటు రైతుబంధు, రైతుబీమా సదుపాయం కూడా ఉంటుందని తెలుపుతున్నారు. అంతే కాకుండా సీసీ కెమెరాలు ఉంటాయని చెబుతున్నారు.

మ్యాపుల్లోనే స్థలాలు

కొనుగోలుదారులకు మ్యాపులపైనే వారి స్థలాల నంబర్లు చూపిస్తారని, వాస్తవానికి భూముల్లో వారికి సంబంధించినప్లాట్లను గుర్తించడం కష్టమే. వారు కొనుగోలు చేసిన స్థలాల్లోకి వెళ్లడానికి దారి కూడా చూపే పరిస్థితి ఉండదు. వాస్తవానికి ఫాంలాండ్స్‌గా తయారు చేసిన భూముల్లో గతంలో ఎప్పుడు పంటలను సాగు చేసిన దాఖలాలు లేవు. బడా రియల్ వ్యాపారులు వందలాది ఎకరాల చొప్పున తక్కువ ధరలకు కొనుగోలు చేసి హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో ఉండే వారికి అరచేతిలో స్వర్గం చూపినట్లు ప్రకటనలు చేస్తూ, ఆయా క్షేత్రాల్లో అభివృద్ధి పనులను చూపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. మూడు నాలుగేళ్ల క్రితం ఈ ఫాంలాండ్స్‌ను కొనుగోలు చేసిన వారు తమ అవసరానికి విక్రయించుకుందామంటే, నానా అవస్థలు పడుతున్నారు. అయినప్పటికీ ఈ సంస్థల వారు హైదరాబాద్ నుంచి ఆదివారం వచ్చిందంటే ఫాంలాండ్స్‌ను పరిశీలించేందుకు వందలాది వాహనాల్లో తీసుకువచ్చి, క్షేత్రాలను చూపుతున్నారు. కొందరు వ్యాపారులైతే మూడు నాలుగు చోట్ల తమ శాఖలను ఏర్పాటు చేస్తున్నారు.

ఆదివారం హైదరాబాద్ నుంచి

హైదరాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన వారిని ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి ఈ ప్రాంతంలోని ఫాంలాండ్స్ వెంచర్లను సందర్శించడానికి తీసుకువస్తున్నారు. ఆదివారమైతే చాలు వందలాది వాహనాలు ఈ ప్రాంతంలో కనిపిస్తున్నాయి. హైదరాబాద్ నుంచి వచ్చిన వారికి ప్రత్యేకంగా విందు ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. ఈ ప్రాంతంలో దాదాపు 50 వరకు బడా రియల్‌ఎస్టేట్ సంస్థలు వ్యాపారం చేస్తున్నాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి తమ ఫాంలాండ్స్ తెలిసే విధంగా ప్రధాన రహదారుల గుండా ప్రత్యేకంగా పోటాపోటీగా బోర్డులను, హోర్డింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు.



ఖేడ్ ప్రాంతంలో ఫాంలాండ్స్‌కు సంబంధించి రహదారుల వెంట ఏర్పాటు చేసిన బోర్డులు

లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- నలుగురికి తీవ్రగాయాలు



దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు ముందు భాగం

గజ్వేల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండల పరిధిలోని రిమ్మనగూడలో అర్ధరాత్రి ఆర్టీసీ బస్సు లారీని ఢీకొట్టింది. హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న కరీంనగర్ టీజీఎస్ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు లారీని ఓవర్‌టేక్ చేయబోయి, వెనుకవైపు నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్రగాయాలు కాగా, పలువురికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ విషయమై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ సైదా తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం

తూప్రాన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పింఛన్ తెచ్చుకోడానికి పోస్టాఫీసుకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఎస్ఐ శివానందం వివరాల ప్రకారం.. తూప్రాన్ పట్టణ పరిధి హైదర్‌గూడకు చెందిన కేశబోయిన సత్తయ్య(70) గతనెల 31న పింఛన్ డబ్బులు తెచ్చుకోడానికి తూప్రాన్ పట్టణంలోని పోస్టాఫీసుకు వెళ్లాడు. ఎంతసేపటికీ రాకపోవడంతో కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం భార్య యాదమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.

చెట్టును ఢీకొన్న ట్రాలీ ఆటో

- 15 మందికి గాయాలు
- పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపేందుకు వెళ్తుండగా ఘటన

శివ్వంపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): టాటా ఏస్ ఆటో చెట్టుకు ఢీకొనడంతో 15 మంది మహిళలకు గాయాలైన ఘటన గురువారం మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలో చోటుచేసుకున్నది. బాధితుల కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం లక్ష్మాపూర్‌లోని భూములకు సంబంధించి భూమిలేని పేదల కోసం పోరాటం చేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఖలేక్‌ను పోలీసులు అరెస్టు చేసి గుమ్మడిదల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆయన అరెస్టుకు నిరసనగా పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేయడానికి చిన్నగొట్టిముక్కల గ్రామానికి చెందిన సుమారు 25 మంది మహిళలు టాటా ఏస్ వాహనంలో గ్రామం నుంచి బయలుదేరారు. శివ్వంపేట మండలం పరిధిలోని టిక్యదేవమ్మగూడెం సమీపంలోని తుక్యతండా శివారులోకి రాగానే అతివేగంగా వెళ్తున్న ఆటో చెట్టును ఢీకొట్టి పల్టీలు కొట్టి పడింది. ఆటోలోని 15 మంది మహిళలకు గాయాలయ్యాయి. వారిలో ఇద్దరికీ తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకుని ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను 108 వాహనంలో నర్సాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరు శివ్వంపేటలోని ఓ ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌లో చికిత్స పొందుతున్నారు.



క్షతగాత్రులను తీసుకెళ్తున్న స్థానికులు

ఉద్యోగులను సర్కారు చర్చలకు పిలవాలి



సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద లీఫ్ ఆర్టిస్టు రావి ఆకుపై రూపొందించిన సీఎం చిత్రపటంతో నిరసన



మెదక్ కలెక్టరేట్ గేటు ఎదుట ముగ్గులు వేసి నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

సంగారెడ్డి అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న సమ్మె 27వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా లీఫ్ ఆర్టిస్టు శివకుమార్ చేతులమీదుగా వంద రావి ఆకులపై రూపొందించిన సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటంతో వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఎం.దత్తు మాట్లాడుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులపై ప్రభుత్వం చిన్నచూపు తగదన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు. మెదక్ కలెక్టరేట్ మెయిన్ గేట్ ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగులు రంగవల్లులు వేసి వినూత్న రీతిలో నిరసన వ్యక్తంచేశారు. ఈ నిరసనలో జిల్లా అధ్యక్షుడు రాజు, కార్యదర్శి పాషా, రాజశేఖర్, సంపత్ పాల్గొన్నారు.

మద్యానికి బానిసై ఒకరి మృతి



ఉప్పరి చంద్రం(ఫైల్)

చేగుంట, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : మద్యాని బానిసై ఒకరు మృతిచెందిన సంఘటన చేగుంట మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకున్నది. చేగుంట ఎస్ఐ చైతన్య కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉప్పరి చంద్రం(49) కొన్నేళ్లుగా మద్యానికి అలవాటు పడి ఉదయం నుంచి రాత్రి వరకు తాగుతుండడంతో ఆరోగ్యం క్షీణించినది. బుధవారం రాత్రి మండల కేంద్రంలోని అన్నపూర్ణ హోటల్ ఆవరణలో మద్యం సేవించి కిందపడగా మృతిచెందాడు. చంద్రంకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య మణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం తూప్రాన్ అసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

రామచంద్రాపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు, రూ.500 జరిమానా విధిస్తూ సంగారెడ్డి డిస్ట్రిక్ సెషన్ కోర్టు మెజిస్ట్రేట్ భవానీచంద్ర తీర్పును వెలువరించిందని సీఐ రవీందర్ తెలిపారు. కొల్లూరులో నివాసముంటున్న ఆగని శ్రీనివాస్, వడ్డె శ్రీనివాస్(30) మిత్రులు. కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఆగని శ్రీనివాస్ వడ్డె శ్రీనివాస్ వద్ద రూ.10వేలు అప్పు తీసుకున్నాడు. డబ్బులు అడుగుతున్నాడన్న కోపంతో ఆగని శ్రీనివాస్ వడ్డె శ్రీనివాస్‌ను హతమార్చాలని పథకం రచించాడు. 2020 ఫిబ్రవరి 15వ రాత్రి వడ్డె శ్రీనివాస్‌కు ఫుల్‌గా మద్యం తాగించి, కత్తితో దాడిచేశాడు. రక్తపు మడుగులో ఉన్న బాధితుడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఐదురోజుల చికిత్స అనంతరం మృతి చెందాడు. అప్పట్లో రామచంద్రాపురం సీఐలు రమేష్, జగదీష్ కేసు నమోదు, దర్యాప్తు చేపట్టారని కొల్లూరు సీఐ రవీందర్ తెలిపారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న సిబ్బంది

హుస్నాబాద్ జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయం హుండీ లెక్కింపు గురువారం నిర్వహించారు. రూ.3,00,286 ఆదాయం వచ్చిందని దేవాదాయ జిల్లా పర్యవేక్షణాధికారి పి.విజయలక్ష్మి తెలిపారు. ఇందులో 72 గ్రాముల మిశ్రమ బంగారం, 8 కిలోల రాళ్లతో కూడిన వెండి లభించిందన్నారు. హుస్నాబాద్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో ని దేవాలయం అకౌంట్ హుండీ నగదును జమ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్య నిర్వహణ అధికారి కిషన్‌రావు, మాజీ చైర్మన్లు పుదరి లక్ష్మీనారాయణ, పచ్చిమట్ల శ్రీనివాస్‌గౌడ్, పూదరి శ్రీనివాస్, పూదరి వరప్రసాద్, పెరుమాళ్ళ నర్సాగౌడ్, గోమాత సేవా పరిషత్ అలివేలుమంగ భజన బృందం, గోదాదేవి భజన బృందం, చౌటపల్లి సరస్వతి మహిళా మండలి, కొత్తకొండ దేవాలయ అర్చక సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

20 మందికి జరిమానా

గజ్వేల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన వారినికి జరిమానా విధిస్తూ గజ్వేల్ అదనపు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక తీర్పును వెలువరించినట్లు గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి తెలిపారు. కొన్ని రోజుల క్రితం గజ్వేల్ పట్టణంలోని ఆయా చౌరస్తాల్లో డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు జరుపగా, 20మంది పట్టుబడ్డారు. వారిని గురువారం కోర్టులో హాజరుపరచగా, విచారణ చేపట్టిన న్యాయమూర్తి రూ.14వేల జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారన్నారు.

ప్రభుత్వ కెపాసిటీ బిల్డింగ్ కమిషన్‌తో కేఎస్‌పీపీ అవగాహన ఒప్పందం

● 2.5 కోట్ల మంది పౌర సేవకుల సామర్థ్యాన్ని బలోపేతం చేయడమే లక్ష్యం



ఒప్పంద పత్రాలను చూపుతున్న కేఎస్‌పీపీ, సీబీసీ ప్రతినిధులు

పటాన్‌చెరు రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వంలోని కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ (సీబీసీ)తో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కేఎస్‌పీపీ) గురువారం న్యూఢిల్లీలోని సీబీసీ కార్యాలయంలో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నది. ప్రభుత్వంలోని మానవ వనరుల నిర్వహణ పద్ధతులను మెరుగుపరచడం, దేశంలోని 2.5 కోట్ల పౌర సేవకుల సామర్థ్యాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో ఈ భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకున్నది. కేఎస్‌పీపీ తరఫున డీన్, పూర్వ రాయబారి సయ్యద్ అక్బరుద్దీన్, డాక్టర్ షరీక్ హసన్ మనజీర్, సీబీసీ ప్రతినిధి బృందంలో మానవ వనరుల విభాగం సభ్యుడు డాక్టర్ ఆర్. బాలసుబ్రమణ్యం, సంయుక్త కార్యదర్శి ఎస్‌పీ రాయ్, ఇతర అధికారులు రాహుల్ పోర్వాల్, నిఖితా సురానా తదితరులు పాల్గొనగా అవగాహనా ఒప్పందంపై సంతకం చేశారు. వివిధ మంత్రిత్వ శాఖల పరిధిలోని విభాగాల కోసం సామర్థ్యాలను పెంపొందించే ప్రణాళికలను రూపొందించి, అమలు చేయడానికి సీబీసీ కృషి చేస్తోంది. దీని కోసం సమగ్రమైన, ముందుచూపుతో కూడిన వ్యూహాలను అభివృద్ధి చేయడానికి ప్రముఖ సంస్థలతో వ్యూహాత్మక భాగస్వామ్యాలను ఏర్పాటు చేసుకుంటోంది. ఈ నాలెడ్జ్ పార్టనర్‌షిప్ కింద, కేఎస్‌పీపీ రియల్ టైమ్ పాలసీ సిమ్యులేషన్ సహా, వాటికి అనుగుణమైన అభ్యాస వనరులను అందిస్తుంది. ప్రవర్తనా నైపుణ్యాల శిక్షణతో పాటు నైతిక నిర్ణయాధికారం, నాయకత్వం, డిజిటల్ పాలనతో పాటు యోగ్యత ఆధారిత మాడ్యూల్స్‌పై దృష్టి సారిస్తూ అధునాతన శిక్షణా కార్యక్రమాలను అభివృద్ధి చేస్తుంది. ప్రభుత్వ అధికారుల కోసం ఆన్‌లైన్, హైబ్రిడ్ కోర్సులను రూపొందించడానికి, డిజిటల్ మౌలిక సదుపాయాల రూపకల్పనలను కేఎస్‌పీపీ చేస్తుంది. అందుబాటులోని, ప్రభావవంతమైన అభ్యాస పరిష్కారాలను నిర్ధారిస్తుంది. కేఎస్‌పీపీ, సీబీసీ మధ్య ఈ భాగస్వామ్యం, కేంద్ర ప్రభుత్వ పాలనలో విప్లవాత్మక మార్పులకు, భారతదేశ పౌర సేవల సామర్థ్యాన్ని పెంపొందించడానికి ప్రతీకగా నిలవనుంది.



హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు వద్ద ఎంఎండీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం(ఫైల్)

ఉల్లాసంగా ఉదయం.. ఆరోగ్య సందేశం

హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కట్ట వేదికగా ఎంఎండీ గ్రూపు

'ఎవరి ఆరోగ్య జీవితానికి వారే కథానాయకులు' అనే నినాదంతో ముందుకు

నిత్యం వాకింగ్, జాగింగ్, రన్నింగ్, స్విమ్మింగ్, సైక్లింగ్, యోగా, ధ్యానం

హుస్నాబాద్, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : రోజూ తెల్లవారుజామున హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు సందడిగా ఉంటుంది. వాకింగ్, జాగింగ్, స్విమ్మింగ్, యోగా, ధ్యానంతో పాటు వ్యాయామాలు, పాటలు, నృత్యాలు వంటి ఉల్లాసమైన కార్యక్రమాలతో పదేళ్ల పిల్లల నుంచి 65 ఏళ్ల వృద్ధుల వరకు అక్కడ దర్శనమిస్తారు. వారంత ఎంఎండీ సభ్యులు. మూడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఎంఎండీ అంటే మార్నింగ్ మాండెటరీ డ్యూటీ. ఇది సంఘం కాదు, సంస్థ కాదు. అందరూ ఆరోగ్యంగా ఉండాలని చెప్పేందుకు ఏర్పాటు చేసిన సందేశం. దాదాపు 150 మంది సభ్యులు ఉన్నారు. మార్నింగ్ మాండేటరీ డ్యూటీకి నాయకులు ఉండరని, ఎవరి ఆరోగ్య జీవితానికి వారే కథ నాయకులని చెబుతారు.

ఉదయాన్ని ఆస్వాదించాలి

హుస్నాబాద్ పట్టణ ప్రజలే కాకుండా వివిధ గ్రామాల నుంచి యువకులు ఇక్కడికి వచ్చి ఇందులో పాల్గొంటారు. ఇందులో ఉద్యోగులు, వ్యాపారులు, రైతులు, కూలీలు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు అన్ని వర్గాల వారు ఉన్నారు. ఇష్టమైన ఆటలకు, పాటకు, ఉల్లాసానికి ఉదయమే ప్రధానమైనది. ఉదయాన్ని కష్టం అనుకోకుండా ఆస్వాదించాలని ఈ ఎంఎండీ సభ్యులు చెబుతారు. ఎల్లమ్మ చెరువు పెద్ద తూము వద్ద దర్శనమిచ్చే ఫెక్సీలోనూ 'రోజువారి నీ వృత్తి నిర్వాహణకు మరొకరు హాజరుకావచ్చు.. కానీ, నీ ప్రవృత్తి వ్యాయామ విధికి నువ్వే హాజరుకావాలి' అని ఉంటుంది.


ఎల్లమ్మ చెరువు తూము వద్ద యోగా చేస్తున్న సభ్యులు


ఎల్లమ్మ చెరువులో ఈత కొడుతున్న సభ్యులు

అందరూ కలిసి విస్తరణ

పట్టణంలోని ఎల్లమ్మచెరువు కట్టకు ప్రతీ రోజు వాకింగ్, జాగింగ్‌కు వచ్చే వారు కలిసి 2021లో గ్రూపుగా ఏర్పడి దీనిని విస్తరించాలనుకున్నారు. 2022 మే 1న ఎంఎండీ (మార్నింగ్ మాండేటరీ డ్యూటీ)గా నామకరణం చేశారు. దీనికి కమిటీ, సంఘం, సంస్థ అనేది లేకుండా అందరినీ సభ్యులుగానే పరిగణిస్తారు. పట్టణానికి చెందిన గీకురు బాలయ్య గేదెలు కాచుకునే వ్యక్తికి పక్షవాతం వచ్చింది. ఆయనకు పరిచయం ఉన్న కొంతమంది సభ్యులు కట్ట వద్దకు తీసుకురాగా బాలయ్యతో నడక, వ్యాయామాలు చేయించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం మెరుగుపడి మళ్లీ తన పనిలో నిమగ్నమయ్యాడు. ఆనాటి నుంచి బాలయ్య క్రమం తప్పకుండా ఉదయం వేళ వస్తారు. ఎంఎండీ సభ్యులుగా చేరిన వారిలో కొంతమంది 8, 9 కిలోమీటర్ల నుంచి కూడా ఉదయం వేళ హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కట్ట వద్దకు వస్తారు. వ్యాయామంతో పాటు ఆరోగ్యానికి సంబంధించి అన్నింట్లో ముందుంటారు. పుట్టిన రోజులు, మ్యారేజ్ డేలను ఎంఎండీ ద్వారా నిర్వహిస్తారు. వాటర్ మిలాన్ లేక ఇతర ఫ్రూట్స్‌తో ప్రత్యేకంగా తయారు చేయించిన కేక్‌లను కట్ చేయిస్తారు. అలాగే ఎంఎండీ వాట్సప్ గ్రూపులో ఆరోగ్యానికి సంబంధించిన మెస్సెజ్‌లు మాత్రమే ఉంటాయి.

అందరూ ఆరోగ్యంగా ఉండాలనేదే ఉద్దేశం



ఇది సంస్థ లాంటిది కాదు. అందరూ ఆరోగ్యంగా ఉండాలనే సందేశం పంపేందుకు ఎంఎండీని ఏర్పాటు చేశాం. మూడు సంవత్సరాల నుంచి క్రమం తప్పకుండా ఎల్లమ్మ చెరువు కట్టపై ఆరోగ్య కార్యక్రమాలు చేపడుతున్నాం. అనారోగ్యంగా ఉన్న వారు ఎంఎండీలోకి వచ్చి ఆరోగ్యవంతులుగా మారారు. దాదాపు 100 మందికి ఎల్లమ్మ చెరువులో ఎంఎండీ స్విమ్మింగ్ నేర్పించింది. ఇక్కడ జరిగే కార్యకమాలు మరికొందరికి స్ఫూర్తినిచ్చి దినదినం సభ్యుల సంఖ్య పెరుగుతుంది.

- నీలం సంపత్, కానిస్టేబుల్

కలిసి వ్యాయామం చేయడం ఉల్లాసాన్నిస్తుంది



గ్రూపుగా వ్యాయామాలు, యోగా, స్విమ్మింగ్ చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండటమే కాకుండా ఉల్లాసాన్నిస్తుంది. మూడు సంవత్సరాల నుంచి వాకింగ్, చెరువులో ఈత కొడుతున్నా. దీంతో బీపీ కంట్రోల్ కావడమే కాకుండా ట్యాబ్లెట్ వినియోగించని పరిస్థితి వచ్చింది. మనం ఎంత బిజీగా ఉన్నా ఉదయం ఒక గంట ఆరోగ్యం కోసం వెచ్చించాలనేది ఈ ఎంఎండీ ఉద్దేశం.

- బొలిశెట్టి సుధాకర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్

నేడు ఐఐటీహెచ్‌కు ఉపముఖ్యమంత్రి రాక

● ఏఐసీఎంఆర్‌హెచ్‌ను ప్రారంభించనున్న భట్టి విక్రమార్క

● ఖనిజాల పరిశోధనకు ఐఐటీహెచ్‌లో శాస్త్రవేత్తలతో సదస్సు


కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్

కంది, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌కు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం రానున్నట్లు ఐఐటీహెచ్ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐఐటీహెచ్‌లో శుక్ర, శని వారాల్లో నిర్వహించే ఏఐసీఎంఆర్‌హెచ్ (ఆస్ట్రేలియా-ఇండియా క్రిటికల్ మినరల్స్ రీసెర్చ్ హబ్)ను ఆయన ప్రారంభించనున్నారు. ఆస్ట్రేలియా మోనాష్ యూనివర్సిటీ-ఐఐటీ హైదరాబాద్ సంయుక్తంగా తొలిసారిగా శాస్త్రవేత్తల సదస్సు నిర్వహిస్తున్నాయి. ఆస్ట్రేలియా శాస్త్రవేత్తలతో పాటు భూగర్భ గనుల శాఖ అధికారులు, ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ అధికారులు హాజరుకానున్నారు. ఇందులో భాగంగానే ఖనిజ వనరుల భాగసామ్యాన్ని విస్తరించేందుకు ఆస్ట్రేలియా శాస్త్రవేత్తలు ఐఐటీహెచ్ పరిశోధకులతో కలిసి చర్చలు జరిపి ప్రణాళికలు రచించనున్నారు. క్లిష్టమైన గనులను గుర్తించి భవిష్యత్ పరిశోధనలకు ఖనిజాల అభివృద్ధిపై అధ్యాయనం చేయనున్నారు. ఐఐటీహెచ్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెటీరియల్స్ సైన్స్ అండ్ మెటాలార్జికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఆస్ట్రేలియా-ఇండియా క్రిటికల్ మినరల్స్ హబ్ పేరుతో జరగనున్న ఈ సదస్సులో ప్రపంచంలో ఖనిజాల అంచనా, క్లిష్టమైన ఖనిజాల అభివృద్ధికి వ్యూహాలు రూపొందించడం, ఖనిజాలు ఎక్కడెక్కడ ఉన్నాయో వెలికితీసి వాటిని రీసైక్లింగ్ చేయడానికి వివిధ రకాల పద్ధతులపై శాస్త్రవేత్తలు పరిశోధనలు జరపనున్నారు. ఖనిజాల అభివృద్ధికి భవిష్యత్ పరిశోధనల కార్యచరణకు ప్లీనరీ చర్చలు, వర్క్‌షాప్ జరుగుతాయి. ఈ కార్యక్రమానికి ఆదిత్య బిర్లా, ఎన్ఎండీసీ, జీఎండీసీ, ఎస్సీసీఎల్ సంస్థలు సహకారం అందించనున్నట్లు ఐఐటీహెచ్ అధికారులు తెలిపారు.

గుజరాత్ వర్క్‌షాప్‌లో ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం

కోహెడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెరికలగడ్డ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.రవివర్మ గుజరాత్ రాష్ట్రంలో నిర్వహిస్తున్న సీసీఎల్ సృజనాత్మక బోధన ప్రయోగ కార్యశాలలో పాల్గొన్నారు. గుజరాత్‌లోని గాంధీనగర్ ఐఐటీలో ఐదు రోజులపాటు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తుండగా, ఇప్పటికే రెండు రోజులుగా రవివర్మ శిక్షణ కొనసాగిస్తున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యావేత్తలతో సమిష్టిగా పాల్గొని అభ్యాసన సామగ్రి తయారీలో శిక్షణ తీసుకుంటున్నారు.


వర్క్‌షాప్‌లో ప్రధానోపాధ్యాయుడు రవివర్మ

శ్రీగంధం.. లాభాల సుగంధం

రైతులకు అందుబాటులో మొక్కలు

ప్రోత్సహిస్తున్న అటవీ కళాశాల

కేర్స్ సొసైటీ ఆధ్వర్యంలో పెంపకం

ములుగు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): శ్రీగంధం చెట్ల పెంపకంతో రైతులు మంచి లాభాలను ఆర్జించవచ్చు. రైతులను ప్రోత్సహించడానికి ములుగు మండలంలోని అటవీ కళాశాల పరిశోధన సంస్థ కృషి చేస్తుంది. అటవీ కళాశాలలో సెంటర్ ఫర్ ఆగ్రోఫారెస్ట్రీ రిసెర్చ్ అండ్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ (కేర్స్) సొసైటీని ఏర్పాటు చేశారు. ఈ సొసైటీ ఆధ్వర్యంలో నర్సరీలను నిర్వహిస్తున్నారు. అందులో శ్రీగంధం మొక్కలను పెంచుతున్నారు. ఈ నర్సరీ ద్వారా రైతులకు నాణ్యమైన గంధం మొక్కలను అందజేయడానికి నిర్ణయించారు. సొసైటీకి ప్రధానకార్యదర్శిగా సహాయ ఆచార్యులు డాక్టర్ మిలకూరి చిరంజీవ రెడ్డిని నియమించారు. ఆయన ఆధ్వర్యంలో నర్సరీలలో 1.75 లక్షల మొక్కల పెంపకం చేపట్టారు. సుమారు 10 నెలల వయస్సున్న శ్రీగంధం మొక్కలు రైతులకు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఒక్కో మొక్కను రూ.25కే అందించనున్నారు.

ఎకరాకు రూ.కోట్లల్లో ఆదాయం

శ్రీగంధం కలపకు ప్రపంచ వ్యాప్తంగా విపరీతమైన డిమాండ్ ఉంది. పరిమళ ద్రవ్యాలు, సౌందర్య సాధనాలు, ఫార్మాస్యూటికల్ పరిశ్రమలో వినియోగిస్తుంటారు. రైతులు శ్రమతో పెంపకం చేసి ఓపికతో ఉంటే భారీ లాభాలను ఆర్జించవచ్చు. ఎకరాలో శ్రీగంధం మొక్కలను నాటితే 15-20 ఏళ్లలో చెట్లుగా మారి రూ.3 కోట్ల వరకు ఆదాయం రావచ్చు. గంధం కలప కిలో ధర సగటును రూ.6 వేల వరకు ఉంటుంది. ఒక్కొక్క ఎకరాకు సుమారు 5000 కిలోల కలప దిగుబడి వస్తుంది.



ములుగు అటవీ కళాశాల

రైతులకు మద్దతు

గంధం సాగు చేపట్టిన రైతులకు ములుగు ఫారెస్టు కళాశాల రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేర్స్ సొసైటీ సహాయసహకారాలను అందించనుంది. తోటల పెంపకం, ఆగ్రో ఫారెస్ట్రీని అభ్యసిస్తున్న విద్యార్థులు రైతుల ప్రయత్నాలకు మద్దతు అందజేస్తారు. పర్యావరణ పరిరక్షణ, గంధపు చెక్క పరిశ్రమ వృద్ధికి సహకారం అందిస్తుంది. తోటల పెంపకం, మెలకువల కోసం కేర్స్ సొసైటీ ప్రధాన కార్యదర్శి నంబరు 7330969580 సంప్రదించవచ్చు.


కేర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీగంధం మొక్కల నర్సరీ



పింఛన్ కోసం పడిగాపులు

చేర్యాల మండలం గుర్జకుంట గ్రామానికి చెందిన వృద్ధులు, వితంతువులు పింఛన్ డబ్బు కోసం గురువారం గ్రామ శివారులోని రైతువేదిక వద్ద పడిగాపులు కాశారు. ప్రతినెలా మొదటి తేదీ నుంచి పంపిణీ చేస్తుండటంతో రెండు రోజులుగా లబ్ధిదారులు పంపిణీ కేంద్రానికి వచ్చి వెళుతున్నారు. కానీ గురువారం సాయంత్రం వరకు ఇవ్వకపోవడంతో ఇబ్బందులుపడ్డారు. గతంలో గ్రామం లోపల ఉన్న పంపిణీ కేంద్రాన్ని శివారులోని రైతువేదిక వద్దకు మార్చడంతో కాలినడకన వెళుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.

- చేర్యాల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి)

అడుగు పెట్టిందేలే..!

అందోలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి తాళం

కన్నెత్తి చూడని మంత్రి దామోదర్

ఏడాదిగా నిరుపయోగంగానే

జోగిపేట, జనవరి2(ఆంధ్రజ్యోతి): అందోలు-జోగిపేట మున్సిపల్ పరిధి అందోలు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోకి స్థానిక ఎమ్మెల్యే, మంత్రి దామోదర్ రాజనర్సింహ అడుగు పెట్టడం లేదు. తాను గెలిచి సంవత్సరం అవుతున్నా.. నేటికీ అటువైపు కన్నెత్తి చూడలేదు. దీంతో ఏడేళ్ల క్రితం నిర్మించగా, ఇద్దరు ఎమ్మెల్యేలకు కార్యాలయంగా ఉపయోగపడిన ఈ భవనం ప్రస్తుతం వాడుకలో లేకుండా పోయింది. ప్రస్తుతం ఎమ్మెల్యేగా గెలిచి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న దామోదర్ రాజనర్సింహ తన క్యాంపు కార్యాలయంగా ఈ భవనాన్ని ఉపయోగించడం లేదు.

2017లో అప్పటి టీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన బాబూమోహన్ హయాంలో మొదలైన ఈ కార్యాలయ భవన నిర్మాణం.... 2019లో ఆయన పదవీ కాలం ముగిసే నాటికి పూర్తయింది. ఆయన క్యాంపు ఆఫీస్‌కు అధికారికంగా పూజ చేశారు. అయితే, తదుపరి ఎన్నికల్లో ఆయనకు బీఆర్ఎస్ తరఫున మళ్లీ టికెట్ రాలేదు. ఆఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి టికెట్ సాధించిన క్రాంతికిరణ్ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత సతీసమేతంగా శాస్త్రోక్తంగా ఈ కార్యాలయానికి పూజ చేసి గృహ ప్రవేశం జరిపారు. ఐదేళ్ల పాటు ఆయన భవనాన్ని తన అధికారిక క్యాంపు కార్యాలయంగా వాడుకున్నారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన దామోదర్ రాజనర్సింహ అందోలు ఎమ్మెల్యేగా గెలిచి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా పదవిని చేపట్టిన సంగతి విదితమే. అయితే, దామోదర ఈ భవనం వైపు కన్నెత్తైనా చూడకపోవడంతో నిరుపయోగంగా మారింది.


తాళం వేసి ఉన్న అందోలులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం

ప్రజలకు ఇబ్బంది కాకూడదనే...

నియోకవర్గంలోని ప్రజలకు, అధికారులకు ఇబ్బంది కాకూడదనే దామోదర్ రాజనర్సింహ అందోలులోని క్యాంపు కార్యాలయాన్ని వాడడం లేదని తెలుస్తోంది. ఆయన సంగారెడ్డిలోని తన సొంత నివాసాన్నే క్యాంపు ఆఫీస్‌గా మార్చారు. వైశాల్యంపరంగా పెద్దగా ఉండి.. అందోలు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు అనువుగా ఉండడమేకాకుండా, జిల్లా అధికారులకు కూడా జిల్లా కేంద్రంలోనే మంత్రిగా అందుబాటులో ఉండవచ్చన్న కారణంతో ఆయన సంగారెడ్డిలోని నివాసాన్నే తన క్యాంపు కార్యాలయంగా చేసుకుని కార్యకలాపాలు సాగిస్తున్నారు. అందోలులోని క్యాంపు కార్యాలయాన్ని వాడడం వల్ల.. ప్రజలకు అటు అందోలుకు వెళ్లాలా లేక సంగారెడ్డికి వెళ్లాలా అన్న సందిగ్ధత ఏర్పడుతుందని మంత్రి భావించడం మరో కారణమని చెప్పవచ్చు. పదేళ్ల క్రితం కూడా తాను మంత్రిగా, ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన సమయంలోనూ.. ఆతర్వాత అధికారంలో లేని పదేళ్లపాటు సంగారెడ్డిలోని తన నివాసంలోనే కలిసేవారు. పైరవీలకు ఆస్కారం ఉండొద్దన్నది కూడా... క్యాంపు ఆఫీస్‌ను మంత్రి వాడకపోవడానికి ఇంకో కారణమని తెలుస్తోంది. అందోలులోని క్యాంపు కార్యాలయానికి కార్యకర్తలు, ప్రజలు వస్తే.. దీనిని ఆసరాగా చేసుకుని మోసం చేసే ప్రమాదముంటుందని కూడా ఆయన భావిస్తున్నట్టు తెలిసింది.

న్యూస్ బాక్స్



సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ సురేష్‌షెట్కార్

సీఎంకు ఎంపీ శుభాకాంక్షలు

నారాయణఖేడ్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ గురువారం హైదరాబాద్‌లో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

వారీకార్ భక్తుల పాదయాత్ర

నారాయణఖేడ్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): న్యాల్‌కల్ మండలం రేజింతల్‌లోని సిద్ధివినాయక 225వ జయంతిని పురస్కరించుకుని మహారాష్ట్రలోని పండరీపూర్‌కు చెందిన అంబాదాస్ మహరాజ్ శిష్య బృందం ఆధ్వర్యంలో ఖేడ్ పట్టణంలోని కాశీనాథ్ మందిరం నుంచి గురువారం పాదయాత్రను చేపట్టారు. ఈ పాదయాత్ర శుక్రవారం అక్కడికి చేరుకోనున్నది.

42 డెస్కులు అందజేత

రామాయంపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రామాయంపేట మండల పరిధి ఝాన్సీ లింగాపూర్ ప్రాథమిక పాఠశాలకు రోటరీ క్లబ్ 42 డెస్కులను గురువారం బహూకరించింది. హైదరాబాద్‌కు చెందిన సంస్థ వ్యవస్థాపకుడు సాయికుమార్ విద్యార్థుల సౌకర్యార్థం వీటిని పంపిణీ చేశారు.

పద్మశాలి యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అనిల్

జహీరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : పద్మశాలి యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సోమ అనిల్ నియామకమయ్యారు. గురువారం సంగారెడ్డిలో రాష్ట్ర అధ్యక్షుడు అంబలి శ్రీనివాస్ నియామకపత్రాన్ని అందజేశారు.

విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు



మిర్జాపల్లి హైస్కూల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చిన్నశంకరంపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలంలోని మిర్జాపల్లి, చందంపేట హైస్కూల్ విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు చేశారు. గురువారం ఎంఈవో పుష్పవేణి కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఎల్‌వీ ప్రసాద్ హాస్పిటల్ సౌజన్యంతో వైద్య శిబిరం నిర్వహించి, పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కంటి అద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సొంత నిధులతో విద్యుత్ స్తంభాలు



విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయిస్తున్న దృశ్యం

నర్సాపూర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని రెండో వార్డులో విద్యుత్ స్తంభాలు లేక వైర్లు వేలాడుతున్నాయి. ఈ విషయం తెలుసుకున్న కౌన్సిలర్ లతారమేష్‌యాదవ్ తన సొంత నిధులతో వార్డులో అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి సమస్యను తీర్చారు. ఎన్నోరోజులుగా ఉన్న సమస్యను పరిష్కరించడంతో ప్రజలు కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



సంగారెడ్డిలోని పాత డీఆర్డీఏ ఆఫీస్ ప్రాంగణంలో నిలిచిన బీసీ హాస్టల్ భవన నిర్మాణం

'బీసీ' హాస్టల్ నిర్మాణానికి నిధుల గ్రహణం

- రూ.2.90 కోట్లతో జీ+1 భవనం
- ఏడాదిలో పూర్తి చేయాలని ఒప్పందం
- రెండేళ్లు దాటినా అసంపూర్తిగానే..
- అద్దె భవనంలో బీసీ హాస్టల్
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు

సంగారెడ్డి అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : బీసీ హాస్టల్ నిర్మాణానికి నిధుల గ్రహణం పట్టుకున్నది. ప్రభుత్వం సకాలంలో నిర్మాణ నిధులు విడుదల చేయకపోవడంతో నిర్మాణాలు అసంపూర్తి దశలో నిలిచిపోతున్నాయి. ఫలితంగా సర్కారు ఆశయం నెరవేరక మూడ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోతున్నాయి. సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని పాత డీఆర్డీఏ కార్యాలయం ప్రాంగణంలో రూ.2 కోట్ల 90 లక్షలతో బీసీ హాస్టల్ నిర్మాణానికి 2022లో శంకుస్థాపన చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త వాటాతో బీసీ వెల్ఫేర్ నిధుల నుంచి జీ+1 భవనం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ నిర్మాణ సంస్థ పనులు చేపట్టగా, ఏడాదిలో పూర్తి చేసి అప్పగించాలని కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ చేసుకున్నారు.

నిలిచిన పనులు

బీసీ హాస్టల్ నిర్మాణం కోసం సర్కారు రూ.2 కోట్ల 90 లక్షల నిధులు కేటాయించింది. కానీ ఇప్పటివరకు కాంట్రాక్టర్‌కు రూ.80 లక్షల నిధులే ప్రభుత్వం నుంచి విడుదలయ్యాయి. పనులు దాదాపు తుది దశకు చేరుకున్నాయి. గోడలకు ప్లాస్టరింగ్ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. చేసిన పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో మూడునెలల కిందట కాంట్రాక్టర్ పనులు నిలిపేశారు. ఫలితంగా పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో రెండేళ్లు దాటినా భవనం అందుబాటులోకి రాలేదు.

అద్దె భవనంలో..

దీంతో ఈ బీసీ హాస్టల్ భవనం కొన్నేళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతున్నది. రెండేళ్ల కిందట సర్కారు పక్కా భవనం కోసం స్థలం, నిధులు కేటాయించినా సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో పనులు పూర్తికాలేదు. ఫలితంగా విద్యార్థినులు అద్దె భవనాల్లో అరకొర సౌకర్యాల నడుమ వసతి ఉండాల్సిన పరిస్థితి వస్తున్నది. ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేసి బీసీ హాస్టల్ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థినులు కోరుతున్నారు.

అభివృద్ధి సహించలేకే తప్పుడు ఆరోపణలు

- నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకులు నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ పేరుతో వసూళ్లు చేశారని, ప్రస్తుతం తాము అభివృద్ధి పనులు చేస్తుంటే సహించలేక అడ్డంకులు సృష్టిస్తున్నారని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి ఆరోపించారు. గురువారం నారాయణఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లిటికేషన్ ఉన్న భూములను పోలీసులతో వాటి సంబంధీకులను భయభ్రాంతులకు గురిచేసి, కబ్జాలకు పాల్పడడమే కాకుండా నిమ్స్ ట్రో, జనతా ఎస్టేట్, తదితర ఫాంలాండ్స్ వారితో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడ్డారన్నారు. హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, భూమిలేని వారికి ఫాంలాండ్స్ పేరిట రిజిస్ట్రేషన్ చేయించి మోసం చేశారన్నారు. బీఆర్ఎస్ నాయకుల అవినీతి, అక్రమాలపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని ఎమ్మెల్యే సవాల్ విసిరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు రమేష్ చౌహాన్, వినోద్‌పాటిల్, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఖేడ్ శివారులోని చాంద్‌ఖాన్‌పల్లి నుంచి కంగ్టి రోడ్డుకు నిర్మించనున్న లింక్ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో రోజురోజుకూ జనాభా పెరుగుతుందని, రానున్నరోజుల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా మెరుగైన రవాణా సదుపాయం పొందడం కోసం ఈ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, కౌన్సిలర్లు రాజేష్‌చౌహాన్, మాజీ ఎంపీటీసీ రామక్రిష్ణ, పండరిరెడ్డి, జ్ఞానేశ్వర్, లింగారెడ్డి, సవితాహన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధి మంగల్‌పేటలోని పలు వార్డుల్లో పర్యటించి, రోడ్లు, మురుగు కాలువ పనులను పరిశీలించారు. అలాగే క్యాంపు కార్యాలయంలో 101 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.

సీఎం సహాయనిధితో నిరుపేదలకు ప్రయోజనం



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న నాయకులు

జహీరాబాద్/చిలప్‌చెడ్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయనిధితో నిరుపేదలకు ప్రయోజనమని బీఆర్ఎస్ నాయకులు నామకిరణ్, హమ్మాద్‌యాకూబ్, బండి మోహన్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అల్లీపూర్‌కు చెందిన మినాజ్‌ఫాతిమాకు రూ.60 వేలు, ఆఫ్రిన్‌బేగంకు రూ.52 వేలు, సుభాష్‌గంజ్‌కు చెందిన మహ్మద్ ఇంతియాజ్‌కు రూ.16 వేల చొప్పున సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తులసీదాస్‌గుప్తా, శివప్ప, నసీర్, అప్పిరాజ్, ప్రవీన్, చింటు పాల్గొన్నారు. అలాగే చిలప్‌చెడ్ మండలం అజ్జమర్రి గ్రామానికి చెందిన డబ్బెడ మనోజ్, ఆర్.ప్రవీణ్, మల్కని వినీల, మల్కని మల్లేశం, కూని శేకమ్మ అస్వస్థతకు గురికాగా.. చికిత్స నిమిత్తం రూ.94 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, పోచయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

ఆలస్యమంటూ.. అనుమతి నిరాకరణ

- పాఠశాల ఎదుట విద్యార్థుల పడిగాపులు



పాఠశాల లోపలికి అనుమతించకుండా అడ్డుకుంటున్న ఉపాధ్యాయులు

చేర్యాల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఆలస్యంగా వచ్చారన్న కారణంగా పట్టణంలోని సాంఘీక, సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు పలువురు విద్యార్థులను లోపలికి అనుమతించలేదు. దీంతో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు గేటు బయట పడిగాపులు కాశారు. క్రిస్మస్ సెలవుల్లో విద్యార్థులు తమ స్వగ్రామాలకు వెళ్లి తిరిగి పాఠశాలకు చేరుకుంటున్నారు. 9వ తరగతి చదువుతున్న చింతల ఉదయ్‌కుమార్ అనారోగ్యం కారణంతో రెండురోజులు ఆలస్యంగా వస్తానని ప్రిన్సిపాల్‌కు ఫోన్‌చేసి తెలియజేశారు. గురువారం ఉదయం అతడితో పాటు మరికొంత మంది విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి పాఠశాలకు చేరుకున్నారు. నిర్ణీత సమయం కన్నా కొంత ఆలస్యంగా రావడంతో సిబ్బంది గేటు బయటే నిలిపివేవారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ పుల్లయ్యకు ఫోన్ చేసి మాట్లాడితే క్లాస్ టీచర్‌ను కలవాలని, ఆయనను అడిగితే ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని ఒకరిపై ఒకరు చెబుతూ 2 గంటలపాటు ఆరుబయటే ఉంచారు. అనారోగ్యంతో ఉన్నాడని, చికిత్స ప్రతులు చూపించినా అంగీకరించలేదని, ఉన్నతాధికారులు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరారు.

రైతు సమస్యలపై అవగాహన కలిగి ఉండాలి: రాఘవేందర్‌రెడ్డి



సంగారెడ్డిలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతు రక్షణ సమితి నాయకులు

సంగారెడ్డి రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : రైతు సమస్యలపై పంటలు సాగుచేసే ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి అన్నారు. రైతుల సమస్యలపై నిర్వహించే కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాల గురించి గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి విస్తృత ప్రచారం ఇర్వహిస్తామన్నారు. రైతుల బతుకులు బాగుపడేందుకు పంజాబ్, హర్యానా, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లోని రైతుల మాదిరిగా తెలంగాణలోని కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలపై రైతులు తిరగబడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విష్ణువర్ధన్ రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, మల్లేశం, ఆర్.రెడ్డి పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

- స్పెషల్ ఆఫీసర్, తహసీల్దార్ గంగాభవాని

గుమ్మడిదల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : అందరి సహకారంతోనే గ్రామం అభివృద్ధి పథంలో ముందుకుపోతోందని స్పెషల్ ఆఫీసర్, తహసీల్దార్ గంగాభవాని అన్నారు. గురువారం గుమ్మడిదల మండలం అన్నారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. పలువురు గ్రామస్థులు పాల్గొని సభ దృష్టికి సమస్యలను తీసుకొచ్చారు. గ్రామంలో చేపట్టనున్న అభివృద్ధి పనులపైన గ్రామసభలో చర్చించి తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో సంగీత, మాజీ వైస్ ఎంపీపీ మద్ది వీరారెడ్డి, మాజీ సర్పంచ్ మురళి, జయశంకర్‌గౌడ్, మద్ది ప్రతాప్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, దర్గా శ్రీనివాస్, వీరేశం పాల్గొన్నారు.

జీవవైవిధ్యంపై క్విజ్ పోటీలు



విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

ఝరాసంగం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని మాచూనూర్ గ్రామ శివారులో గల డీడీఎస్‌లో గురువారం జహీరాబాద్, ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాలకు చెందిన ఆయా పాఠశాలల విద్యార్థులకు జీవవైవిధ్యంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో సిద్ధార్థ పాఠశాలకు చెందిన విద్యార్థులకు మొదటి బహుమతి, మిర్జాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రెండో బహుమతి, ఝరాసంగం మోడల్ స్కూల్ విద్యార్థులు మూడో బహుమతి గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

భీమా కోరేగావ్ స్ఫూర్తితో రాజ్యాంగాన్ని కాపాడుదాం

సంగారెడ్డి రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : భీమా కోరేగావ్ స్ఫూర్తితో రాజ్యాంగాన్ని కాపాడుకుందామని కులవివక్ష పోరాట సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం, అంబేడ్కర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రామారావు అన్నారు. సంగారెడ్డిలోని అంబేడ్కర్ భవన్‌లో ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సామాజిక న్యాయం కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

'రేడియల్ రోడ్డు పనులను పూర్తి చేయండి'

రామచంద్రాపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్ మున్సిపాలిటీలో అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి గురువారం తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్(తెనా) అధ్యక్షుడు రమణ వినతి పత్రం అందజేశారు.

వృథాగా మహిళా సమైక్య పాత భవనం



వృథాగా ఉన్న మహిళా సమైక్య పాత భవనం

వెల్దుర్తి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు అధికారుల నిర్లక్ష్యంతో వృథాగా మారి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వెల్దుర్తిలో మండల వ్యవసాయ కార్యాలయం పక్కన ఉన్న సమైక్య పాత భవనంలో ఆరేళ్ల క్రితం వరకు ఐకేపీ కార్యాలయం నిర్వహించారు. ఐకేపీ కార్యాలయానికి కొత్తగా భవనం నిర్మించడంతో నూతన భవనంలోకి తరలించారు. దీంతో పాత ఐకేపీ కార్యాలయ భవనం వృథాగా ఉండడంతో శిథిలావస్థకు చేరుకుంది. దీనికితోడు భవనం తలుపులు, కిటికీలు శిథిలమై గోడలకు పగుళ్లు ఏర్పడుతున్నాయి. ప్రజా అవసరాల కోసం నిర్మించిన భవనం వినియోగంలో లేకపోవడంతో కూలిపోయే ప్రమాదం ఉన్నదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి భవనానికి మరమ్మతులు చేసి వాడుకలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

పంట కాలువకు మరమ్మతులు చేయాలి: మున్సిపల్ చైర్మన్

నర్సాపూర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణ పరిధిలోని రాయరావు చెరువు పంట కాలువ ఇళ్ల మధ్య నుంచి వెళ్తుండడంతో.. చెత్తాచెదారం నిండిపోయి దారుణంగా మారింది. మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, వైస్ చైర్మన్ నయిమోద్దీన్‌తో పాటు నీటిపారుదల శాఖ ఏఈ మణిభూషణ్‌తో కలిసి పంట కాలువను గురువారం పరిశీలించారు. కాలువ మరమ్మతుతోపాటు ఫెన్సింగ్ వేసి చెత్తాచెదారం రాకుండా నిధులు మంజూరైనా పనులు చేయకపోవడం పట్ల వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే పనులు చేసి కాలువను బాగు చేయాలని ఏఈకి మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ సూచించారు.

గుట్టుగా గంజాయి రవాణా!

5వ పేజీ తరువాయి

మాసాయిపేటలోని ఓ దాబాలో నిల్వ ఉంచిన 120 గ్రాముల మత్తుపదార్థాలను పట్టుకున్నారు. చిన్నశంకరంపేట మండలం కామారంలో విక్రయిస్తున్న 150 గ్రాముల గంజాయిని పట్టుకొని ఒకరిని అరెస్టు చేశారు. చేగుంట, చిన్నశంకరంపేట మండలాల్లో హైవేను ఆనుకొని పరిశ్రమలు ఉండటంతో ఇక్కడ పనిచేసే బీహార్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, యూపీ రాష్ట్రాల కార్మికులు గుట్టుగా తమ ఇళ్లలోనే దీన్ని తోటి కూలీలకు గంజాయి విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇకపోతే రామాయంపేట మీదుగా హైవే విస్తరించి ఉండటంతో ఒరిస్సా, వైజాగ్ నుంచి నగరానికి చేరుకున్న గంజాయిని ప్యాకెట్లు చేసి ముంబైకి రవాణా చేస్తుంటారు. స్మగ్లర్లు ఒక కారులో గంజాయి తరలిస్తూ.. దానికి ముందు పైలెట్ కారును పంపుతారు. ఎక్కడైనా పోలీసు తనిఖీలు ఉన్నట్లైతే మొబైల్ ఫోన్ ద్వారా వెనుక గంజాయితో వస్తున్న కారును అప్రమత్తం చేస్తారు. తనిఖీలు పూర్తయిన తర్వాతే తిరిగి ప్రయాణం మొదలవుతుంది. అంతేకాదు రాత్రి సమయాల్లో వెళ్లకుండా తెల్లవారుజామున పోలీసు గస్తీ పూర్తయ్యాకే ఈ రవాణా కొనసాగిస్తారు. ఇటీవల క్రమంతప్పకుండా నార్కోటిక్ డిటెక్షన్ డాగ్స్ సహాయంతో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. మత్తు పదార్థాల రవాణాను కొంతమేర కట్టడి చేయగలిగారు, కానీ పూర్తిగా అడ్డుకట్ట పడలేదు.

పరిశుభ్రతతోనే భక్తులకు ఆధ్యాత్మికత

- ఏడీఏ, మండల స్పెషల్ అధికారి వెంకటలక్ష్మి



మరుగుదొడ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఏడీఏ, తదితరులు

కొండాపూర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఆలయ పరిసరాల పరిశుభ్రతతోనే భక్తులు ఆధ్యాత్మికతను పొందుతారని ఏడీఏ, మండల స్పెషల్ అధికారి వెంకటలక్ష్మి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని మరేపల్లి లక్ష్మీనారాయణస్వామి ఆలయ ఆవరణలో స్వచ్ఛభారత్ మిషన్ పథకం నిధులు రూ.3 లక్షలతో కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఆలయాల వద్ద భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడం మంచిదని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు వెంకటేశంగౌడ్, లక్ష్మారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాజు, ఎస్‌బీఎం కో ఆర్డినేటర్ స్వామి, ఏపీఎం వీరప్ప, గణేష్‌నాయక్, టీఏ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతుబజార్ ప్రారంభమయ్యేనా..?

- మూడేళ్లుగా సాగుతున్న పనులు

రామచంద్రాపురం టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : భారతీనగర్ డివిజన్ పరిధి బొంబే కాలనీలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించతలపెట్టిన రైతుబజార్ పనులు నిదానంగా సాగుతున్నాయి. రూ.4 కోట్లు అంచనా వ్యయంగా నిర్ణయించినా.. నిధులు పూర్తిగా విడుదల కాకపోవడంతో మూడేళ్లగా పనులు జరుగుతున్నాయి. రైతులను ప్రోత్సహించే విధంగా అధికారులు రెండు వందల పైచిలుకు దుకాణాలు నిర్మించాలని సంకల్పించారు. చుట్టుపక్కల గ్రామాల్లోని రైతుల ఆరుగాలం కష్టపడి సాగుచేసిన కూరగాయల ఉత్పత్తులు నేరుగా అమ్ముకునే వెసులుబాటు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మరోవైపు రామచంద్రాపురం అశోక్‌నగర్ జాతీయ రహదారికి ఇరువైపులా జరుగుతున్న అమ్మకాలు నిలువరించేందుకు ప్రత్యేకంగా రైతుబజార్ నిర్మాణం చేపట్టారు. రూ.45 లక్షలు విడుదలైతే రైతుబజార్ అందుబాటులోకి వస్తుందని అధికారులు చెప్పారు.

కిసాన్ సమ్మాన్ నిధి పెంపుపై హర్షం



నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

చిన్నశంకరంపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : రైతులకు పెట్టుబడి సాయంగా కిసాన్ సమ్మాన్ నిధి రూ.6 వేల నుంచి రూ.10 వేలు పెంచడంతో బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ గురువారం పీఎం నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్.రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంగా రూ.10 వేలు పెంచడం రైతులకు వరమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు సతీష్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హట్కర్ సమాజ్ అధ్యక్షుడిగా పండరినాయక్



పండరినాథ్‌నాయక్, అనిల్‌కుమార్

నారాయణఖేడ్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ హట్కర్ సమాజ్ అధ్యక్షుడిగా కంగ్టి మాజీ ఎంపీపీ పండరినాయక్, ప్రధాన కార్యదర్శిగా నారాయణఖేడ్‌కు చెందిన అనిల్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని సంఘం నాయకులు తెలిపారు. జుక్కల్ శివారులోని హట్కర్ భవన్‌లో గురువారం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సంజీవ్‌పాటిల్, శ్రీనివాస్‌రావునాయక్, ఉత్తంరావు పాటిల్, సంయుక్త కార్యదర్శిగా అంబాజీరావుపాటిల్, అదనపు కార్యదర్శిగా తేజారావు, సహాయ కార్యదర్శిగా వినోద్‌పాటిల్, కోశాధికారిగా మనోహర్‌రావు పాటిల్, ముఖ్య సలహాదారుగా మనోహర్, కార్యవర్గసభ్యులుగా లక్ష్మణ్‌రావు, సంజీవ్‌రావు, దత్తురావు, నరేష్, పండరిపాటిల్, సోపాన్‌రావు, సుభాష్‌రావు, కిషోర్‌నాయక్, రాందాస్, శివాజీరావుపాటిల్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించారు.

సమయానుగుణంగా ఆర్టీసీ సేవలు : డీఎం



డిపో మేనేజర్ మల్లేశయ్యను సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

నాగల్‌గిద్ద, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సమయానుగుణంగా ఆర్టీసీ సేవలు అందిస్తున్నామని డిపో మేనేజర్ మల్లేశయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని మోడల్ కళాశాలను సందర్శించి ఆర్టీసీ సౌకర్యం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకుని మాట్లాడారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల నుంచి మోర్గి మోడల్ కళాశాల వచ్చే విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా బస్సులు నడుపుతున్నామన్నారు. అనంతరం ప్రిన్సిపల్ సువర్ణ ఆధ్వర్యంలో సిబ్బంది పూలు, శాలువాలతో మేనేజర్‌ను సన్మానించారు. ఆయన వెంట ఆర్టీసీ మార్కెటింగ్ అధికారి పాండు ఉన్నారు.